సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 2 । జనవరి । 2023



మరింత మెరుగ్గా వైద్య సేవలు 8లో



వణికిస్తున్న చలిగాలులు

• కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు 8లో

ఉత్తరద్వార దర్శనానికి వేళాయె 8లో



న్యూస్‌రీల్

మోదమ్మ ఆలయానికి పంచలోహ గంట



గంటను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్, తండ్రి

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయానికి 17 కిలోల పంచలోహ గంటను పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, ఆయన తండ్రి విజయ్‌కుమార్ ఆదివారం అందజేశారు. న్యూఇయర్ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచలోహ గంటను ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రికి వారు అందజేశారు.

నేడు పవనగిరి ప్రదక్షిణ

అడ్డతీగల: ఏజెన్సీలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన అడ్డతీగల పవనగిరి క్షేత్రం సోమవారం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పవనగిరి గిరిప్రదక్షిణ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ చేపడతారు. కోలాటం, భజన సంఘాలతో భక్తి గేయాలు ఆలపించే బృందాలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటాయని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి కొండపై కొలువుదీరిన శ్రీ సుందర సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని సోమవారం తెల్లవారు జామున ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని ఆలయ చైర్మన్ రేవు బాలరాజు ఆదివారం తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఎస్టీయూ నూతన సంవత్సర డైరీని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, క్యాలండర్‌ను సబ్‌కలెక్టర్ సుభం బన్సాల్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఎస్టీసెల్ కన్వీనర్ ఎల్.వేణుగోపాల్,జిల్లా కార్యదర్శి జి.నాగభూషణం,స్టేట్ కౌన్సిలర్ ఎల్.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్ష
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆయనకు పలువురి అభినందన



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి దంపతులు



వడ్డిగూడెంలో చిన్నారులతో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ మహేష్‌రెడ్డి

సాక్షి,పాడేరు: నూతన సంవత్సరం ప్రారంభం రోజు నుంచి జిల్లా సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, డీఆర్వో దయానిధి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ, ఆమె భర్త సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, అన్నిశాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ,ఉపాధ్యాయులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీవో దంపతులు కేకును కట్ చేసి, అందరికి పంచిపెట్టారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పీవో దంపతులు, పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్‌లకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులు అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు వార్షిక క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఆదివాసీల సమక్షంలో ఎస్పీ..

చింతూరు: ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడానికి ప్రాధాన్యమిస్తారు. దీనికి భిన్నంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఏజెన్సీలో ఆదివాసీల నడుమ వేడుకల్లో పాల్గొని అందరినీ అబ్బుర పరిచారు. ఆదివారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయనతో పాటు ఓఎస్డీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. చింతూరులో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ, సబ్ కలెక్టర్, ఏఎస్పీలు పోలీసు సిబ్బందితో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కూనవరం, వీఆర్‌పురం మండలం వడ్డిగూడెంలో జరిగిన వేడుకల్లో కూడా ఎస్పీ పాల్గొన్నారు. ఎటపాక మండలం చెరువుగుంపులో వలస ఆదివాసీల నూతన సంవత్సర వేడుకల్లో చిన్నారులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు పయనించకుండా గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, అసాంఘిక శక్తులకు, కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు అప్పలనాయుడు, గజేంద్రకుమార్, ఎస్‌ఐలు యాదగిరి, సత్తిబాబు, పార్థసారధి పాల్గొన్నారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

అండగా ఉంటాం



ఉదయ భాస్కర్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ, జెడ్పీటీసీలు

కూనవరం: వరదల సమయంలో మీరు పడిన కష్టాలను కళ్లారా చూశాం. మా పోలీసులు కూడా మీకు పూర్తి సేవలు అందించారు. అన్నింటికంటే ముందు ముంపునకు గురయ్యే ఉదయభాస్కర్ కాలనీ వాసులకు ఎల్లప్పుడూ మేము అండగా ఉంటాం.. అని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఉదయభాస్కర్ కాలనీ వాసులతో కలిసి ఆదివారం నూతన సంవత్సరం వేడుకలను పంచుకున్నారు. కేక్ కట్‌చేసి పిల్లలకు తినిపించారు. వృద్ధులకు, కాలనీ వాసులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా కాలనీ వాసులతో మట్లాడుతూ ఈఏడాది గోదావరి వరదలు రాకూడని కోరుకుందామని అన్నారు. వరదల సమయంలో అత్యవసర వైద్య సదుపాయం కావాలంటే పునరావాస కేంద్రమైన కోతులగుట్ట నుంచి ఏడుగురాళ్ల పల్లి గ్రామం వరకు వాహనాలు వెళ్లే సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని కాలనీవాసి మారపాక శ్రీనివాస్ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. రహదారిని పరిశీలించి వరద సమయంలో అలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చా రు. ముంపు గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో సర్వే చేస్తున్నారని, వారికి ఈ ఏడాదిలో పరిహారం అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు 'కొత్త' కానుక

- 5,398 పింఛన్ల మంజూరు
- వేకువజాము నుంచి పంపిణీ
- సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



దిగుమోదాపుట్టులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పింఛనుదారులు



పాడేరు మండలం మారుమూల మాతికబందలో కొత్త పింఛనుదారులు

సాక్షి,పాడేరు: కొత్త సంవత్సరంలో జిల్లాలోని పింఛనుదారుల్లో ఆనందం నెలకొంది. పాత పింఛనుదారులకు పెరిగిన రూ.250 కలిపి అందజేశారు. మరోపక్క కొత్తగా మంజూరైన 5,398 పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. గ్రామవలంటీర్లు పొగమంచు,చలిగాలులను సైతం లెక్కచేయకుండా వేకువజామున ఇంటింటా తిరిగి కొత్త పింఛనుదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక పుస్తకాలు, రూ.2750 పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.

కళ్లల్లో ఆనందం

కొత్త పింఛనుదారుల్లో ఆనందం నెలకొంది. కృతజ్ఞతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మంజూరైన కొత్త పింఛన్లలో తొలిరోజు 65శాతం మేర పూర్తి చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. జిల్లాలో పాత,కొత్త పింఛన్లు కలుపుకుని 1,25,465 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము రూ.34కోట్ల 90లక్షల 27వేల 250ను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని 22మండలాల పరిధిలో ఆదివారం సాయంత్రానికి 44.85శాతం పంపిణీని పూర్తి చేశామని డీఆర్‌డీఏ పీడీ మురళీ తెలిపారు. కూనవరం మండలంలో అత్యధికంగా 84.87శాతం, వీఆర్‌పురంలో 80.86 శాతం, ఎటపాకలో 78.13 శాతం మేర పింఛన్లు అందజేశారు. మిగిలిన మండలాల్లో మాత్రం 50శాతం లోపున పింఛన్ల పంపిణీ జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



పింఛను మంజూరవడంతో ఎంతో సంతోషంగా ఉంది. ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వచ్చి రూ.2750 అందజేశారు. వృద్ధాప్యంలో ఏ పనిచేయలేక ఇంటికే పరిమితమవుతున్నా.ఈ పరిస్థితిలో ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక ఇచ్చి ఎంతో మేలు చేసింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

–కోట మాలన్న, కొత్త పింఛనుదారు, బందపాలం, పాడేరు మండలం

అర్హతే ప్రమాణికంగా పింఛన్ల మంజూరు

- రాజకీయాలకు అతీతంగా సంక్షేమం
- పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మి



పాడేరులో కొత్త పింఛను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



పానిరంగినిలో కొత్త పింఛను పంపిణీ చేస్తున్న అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వై.రామవరంలో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి, పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకను మంజూరు చేస్తున్నారని పాడేరు,అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలో కొత్త పింఛనుదారులకు రూ.2750 చొప్పున నగదును ఆదివారం పంపిణీ చేశారు. పాడేరుకు సంబంధించి తలారిసింగిలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. అరకులోయ మండలం పానిరంగిని గ్రామంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఇంటింటా తిరిగి కొత్త పింఛన్‌దారులకు నగదు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీమెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు, సర్పంచ్ సీదరి రాంబాబు, వలంటీర్ల సంఘం ప్రతినిధులు రాంబాబు,సురేష్, పెదలబుడు సర్పంచ్ పేటేలి దాసుబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజా రమేష్, మాజీ ఎంపీపీ కె.అరుణకుమారి,ఎంపీటీసీలు ఎల్.బి.భీమరాజు,సమర్థి శత్రుఘ్న, గ్రామసచివాలయం కన్వీనర్లు సత్యానందం,రామారావు పాల్గొన్నారు.

వై.రామవరంలో..

వై.రామవరం: మండల కేంద్రం రామవరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎంపీడీవో అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 3,336 మంది పింఛన్లు తీసుకుంటుండగా కొత్తగా మరో 101 మందికి మంజూరయ్యాయన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారుజ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో గెస్ట్ రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో న్యూఇయర్ జోష్



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అయ్యారు. ఫొటోలు తీసుకుని పరవశించిపోయారు.

కొత్తపల్లి జలపాతానికి పర్యటకుల తాకిడి

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలకు ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా ఒడిశాలో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతం వద్ద ఉత్సాహంగా గడిపారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం మైన చాపరాయి జలపాతం వద్ద ఆదివారం మైదన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. గిరిజన మహిళల థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయా. బేంబూ చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

దుడుమ జలపాతానికి..

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన దుడుమ జలపాతం సందర్శనకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. నూతన సంవత్సరం, ఆదివారం సెలవు కావడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం వద్ద పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆహ్లాద వాతావరణంలో గడిపారు. భారీగా పర్యాటకులు తరలిరావడంతో దుడుమ జలపాతం వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కిక్కిరిసిపోవడంతో పర్యాటకులు అవస్థలు పడ్డారు.

బొర్రా గుహలు కళకళ


అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు, నూతన సంవత్సరం రోజునా పర్యాటకులు పోటెత్తారు. 6300 మంది గుహలను అందాలను తిలకించగా, సుమారు రూ.ఐదు లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, చిట్టంపాడు, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకు కళకళలాడాయి. పర్యాటకులు రాకతో అరకు–విశాఖ ప్రధాన రహదారి రద్దీగా మారింది.



వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి



దుడుమ జలపాతం వద్ద వాహనాల రద్దీ



చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతానికి భారీగా తరలివచ్చిన పర్యాటకులు

ముక్కోటి దేవతలు ఒక్కటయ్యే వేళ..

- వైష్ణవాలయాల్లో నేడు ఉత్తరద్వార దర్శనం
- ఉపమాకలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు



స్వామివారి ఉత్సవమూర్తులు

నక్కపల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించేందుకు ఉపమాక సహా జిల్లాలోని వైష్ణవాలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. మూడు కోట్ల దేవతలకు రాక్షస బాధల నుంచి విముక్తి కల్పించిన రోజు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఉపమాక క్షేత్రంలో గరుడాద్రి పర్వతంపై దశావతారాల్లో పదో అవతారమైన కల్కి అవతారంగా శ్రీమన్నారాయణుడు వెలిశారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా ఏర్పాట్లు చేసింది. తిరుపతి, సింహాచలం, అన్నవరం, భద్రాచలం తదితర వైష్ణవ క్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశినాడే ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తే ఉపమాకలో అనునిత్యం ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఇక్కడ గరుడాద్రి పర్వతంపై స్వామివారు కల్కి అవతారంలో స్వయంవ్యక్తమై షడ్భుజాలతో అశ్వారూఢుడై వెలిశారు. 6వ శతాబ్దానికి చెందిన దేవాలయమిది. బ్రహ్మ, నారదుడు ప్రతిష్ఠించిన ఆలయంగా పురాణాలు చెబుతున్నాయి. ముక్కోటి ఏకాదశినాడు సాయంత్రం స్వామివారిని రంగనాథుడిగా అలంకరిస్తారు. శ్రీదేవి, భూదేవి కాళ్లు వత్తుతున్నట్లుగా అలంకరించి పుణ్యకోటి వాహనంపై ఊరేగిస్తారు.

8 వాహనాల్లో తిరువీధి సేవలు

వైకుంఠ ఏకాదశినాడు ఎక్కడా లేనివిధంగా ఉపమాకలో ఎనిమిది వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తారు. రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని, పొన్న వాహనంలో రుక్మిణి సహిత వేణుగోపాలస్వామిని, ఆంజనేయ వాహనంపై సీతారాములను, పల్లకిపై బాలరాముడిని, ఇతర వాహనాలపై తాండవ కృష్ణుడు, ప్రాకార పెరుమాళ్లను ఉంచి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.

ఘనంగా ఏర్పాట్లు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి స్వామివారి ఉత్తరద్వార దర్శనం కోసం వేలాదిమంది భక్తులు తరలివస్తారు. భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దర్శనం లభించేలా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయంలో గోపురాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. బేడా మండపం, మహాద్వారం, ధ్వజస్తంభాల వద్ద పూలాలంకరణ చేసి పందిళ్లు, షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

వరి కుప్పలు దగ్ధం



దగ్ధమవుతున్న వరి కుప్పలు

రావికమతం: గుడ్డిప గ్రామంలో ఆదివారం ఆరు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఆ గ్రామానికి చెందిన యన్నంశెట్టి వెంకునాయుడు, గణేష, రాజు,అప్పలనాయుడు,ఇందల పెంటయ్య,చెన్నంశెట్టి రాము,కర్రి వెంకయ్య,పిల్లా మహాలక్ష్మి,గల్లారాజు ఇటీవల తమ వరి చేనును కోసి స్థానిక పాలకేంద్రానికి సమీపంలో కుప్పలు పెట్టారు. ఈ కుప్పల నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రావికమతం అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు శ్రమించినా ఫలితం లేకపోయింది. సమీపంలో ఉన్న మరో ఐదు వరికుప్పలకు మంటలు వ్యాపించకుండా రక్షించగలిగారు. దారిన పోయేవారు కాల్చిన సిగరెట్ ఆర్పకుండా కుప్పలపై విసిరేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షల మేర నష్టం జరిగినట్టు అంచనా. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఈ నెల 10న తారుమారు సంత

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఈ నెల 10వ తేదీన తారుమారు సంత (పండగ)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకుడు మత్స్యరాస వరహాలరాజు తెలిపారు. ఏటా సంక్రాంతి పండగను పురస్కరించుకుని తారుమారు సంతను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. ఈ ఏడాది రెండు రోజులు వెంకటరాజ్ ఘాట్ వద్ద పంటపొలాల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వారపుసంతకు వచ్చే వ్యాపారులు, ప్రజలు, గిరిజన రైతులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు. సంతకు వచ్చే ప్రజలకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంత కమిటీ సభ్యులు రామరాజు, నాగరాజు, చిన్నబాబు, గిరిబాబు సహకారం అందిస్తారని ఆయన పేర్కొన్నారు.


బీజేపీ రాష్ట్ర కురువృద్ధుడు పీవీ మృతి

- ఉత్తరాంధ్రలో పీవీకి ప్రత్యేక గుర్తింపు
- వివాదరహితుడిగా పేరు
- బీజేపీ శ్రేణుల నివాళులు
- నగరంలో నేడు అంత్యక్రియలు

సాక్షి, విశాఖపట్నం : ఆయనో అజ్ఞాత సూరీడు.. అభినవ అల్లూరి... అలుపెరగని సేనాని.. అందరికీ ఆప్తుడు.. అజాత శత్రువు. పదవుల కంటే విలువలకే ప్రాణమిచ్చి సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజాజీవితాన్ని గడిపిన మహర్షి. ఆశయ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని, ఉపాధికి కోసం ఎంచుకొన్న న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా వదిలేసి వేల మంది జీవితాల్లో వెలుగులు నింపిన కార్మిక నేత, ప్రజా సేవకుడాయన. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆయన పేరు ఎరుగని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆయనే భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు (87). గత కొంతకాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. పార్థివదేహాన్ని పితాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

పదేళ్ల ప్రాయంలోనే ఆర్ఎస్ఎస్ భావాలు పుణికిపుచ్చుకున్న ఆయన తదనంతర కాలంలో అంచెలంచెలుగా ఎదిగారు. వివిధ ఉద్యమాలు, ఆందోళనలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, వివాదరహితుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1951లో రాయలసీమ కరువు సమయంలో అక్కడి వారి కోసం స్వయం సేవకులతో కలిసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలో నగదు, సహాయ సామగ్రి వంటివి సేకరించడం, 1950-54 మధ్య విశాఖ పరిసరాల్లోని కాలేజీలు, యూనివర్సిటీల్లో ఏబీవీపీ యూనిట్ల ఏర్పాటు, భారతీయ జన సంఘ్ కార్యకలాపాల నిర్వహణ, గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొనడం వంటివి ఆయన నాయకత్వ పటిమను చాటాయి. రాజకీయాల్లోకి చేరడం కోసం తన పారిశ్రామిక విస్తరణ అధికారి ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. బీఎస్సీ, బీఏ, బీఎల్ పట్టాలు పొందిన పీవీ బార్ కౌన్సిల్‌లో సామాజిక న్యాయం కోసం పనిచేశారు. 1967-68లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం, గోదావరిపై పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం న్యాయవాద వృత్తిని వదులుకుని జనసంఘ్‌కు పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. 1972-73లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించినప్పుడు పలుమార్లు అరెస్టయ్యారు. ఉత్తర సర్కార్ జిల్లా గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లో ఒకసారి, 1980లో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1975-77 ఎమర్జెన్సీలో లోక్ సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి రైళ్ల నుంచి దూకడం, మారువేషాల్లో తిరగడం వంటివి ఉత్తరాంధ్రలో పీవీకి ప్రాచుర్యాన్ని తెచ్చాయి. విశాఖలోని బీహెచ్‌పీవీ, ఎంఈఎస్, డాక్‌యార్డు, ఎస్ఎస్‌టీఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు, కోరమాండల్ తదితర సంస్థల కార్మిక నాయకుడిగానూ పీవీ వ్యవహరించారు. 1980 నుంచి 1986 వరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తనయుడు పీవీఎన్ మాధవ్ కూడా ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.



ప్రధాని మోదీతో పీవీ చలపతిరావు (ఫైల్)



చలపతిరావు పార్థివ దేహం వద్ద విషణ్ణవదనాలతో కుటుంబ సభ్యులు

గురువుగారుగా..

సీనియర్ నేత కావడంతో బీజేపీ శ్రేణులు పలువురు చలపతిరావును గురువు గారుగా సంబోధిస్తారు. ఆ పార్టీ ముఖ్య నేతలు విశాఖ వస్తే ఆయను కలిసి, యోగక్షేమాలు తెలుసుకుని వెళ్తుంటారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో కొన్నేళ్లుగా పీవీ ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆరిలోవలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. బంధువులు, పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం పీవీ చలపతిరావు పార్థివదేహాన్ని పితాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చావులమదుం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పితాపురం కాలనీకి వచ్చి ఎమ్మెల్సీ మాధవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చలపతిరావు మరణం పట్ల ఎంపీ జీవీఎల్ నరసింహారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మరింత మెరుగ్గా వైద్య సేవలు

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

రాజవొమ్మంగి: ఏజెన్సీ ప్రాంతంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో మరింత మెరుగ్గా, సత్వర సేవలు అందించేందుకు కృషి జరుగుతోందని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగికి ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా చూసుకోవాలని ఆయన పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గను ఆదేశించారు. మన్యంలోని గర్భిణీలలో రక్తహీనత ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. మాతాశిశు మరణాలు అరికట్టేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడి పీహెచ్‌సీలో ప్రసవాలు ఎక్కువ అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శ్రీదుర్గ గర్భిణులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నారని ఆమెను అభినందించారు. బర్త్ వెయిటింగ్ రూమ్‌లో ఉన్న కాకూరి గాయత్రి అనే గర్భిణిని పరీక్షించారు. రక్తహీనత సమస్యను గుర్తించారు. హైరిస్క్ గర్భిణులకు మరింత మెరుగైన వైద్యం అందజేస్తున్నామన్నారు. మందులు కొనుక్కోమ్మని రోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ కోరవద్దన్నారు.అవసరమైతే మీరే బయట మార్కెట్లో మందులు కొని వైద్యం అందించాలని సూచించారు. అందుకు సంబంధించి బిల్లులు సమర్పిస్తే వెంటనే చెల్లిస్తామన్నారు. వార్డుల్లో పడకల కొరతను పరిష్కరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

1500 మందికి కోవిడ్ పరీక్షలు

జిల్లాలోని 64 పీహెచ్‌సీల పరిధిలో ముందు జాగ్రత్త చర్యగా 1500 కోవిడ్ టెస్టులు చేశామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు. ఒక్కటి కూడా పాజిటివ్ నమోదు కాలేదన్నారు. జిల్లాకు 15వేల కోవిడ్ కిట్లు వచ్చాయని, అవసరాన్ని బట్టి వాడుకోవాలని వైద్యులకు సూచించారు.

నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

- ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ప్రశ్నపత్రాల రూపకల్పన
- అనకాపల్లి జిల్లాలో పరీక్షలు రాయనున్న 1,91,800 విద్యార్థులు
- పేపర్లను లీక్ చేస్తే కోడ్ సంఖ్య ఆధారంగా గుర్తింపు



పాఠశాలల వారీగా పరీక్ష ప్రశ్నపత్రాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది



అనకాపల్లి ఎమ్మార్సీలో భద్రపర్చిన సమ్మేటివ్-1 పరీక్ష ప్రశ్నపత్రాలు

అనకాపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మేటివ్-1 పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఈ నెల పదో తేదీ వరకూ నిర్వహించేలా షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసింది. అనకాపల్లి జిల్లాలో 1,91,800 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నపత్రాలు ఉమ్మడి జిల్లా డీసీఈబీ నుంచి ఎమ్మార్సీ కేంద్రాలకు అక్కడ నుంచి పాఠశాలలకు చేరుకున్నాయి. ఎమ్మార్సీ కేంద్రాల్లో పరీక్ష ప్రశ్నపత్రాలను పాఠశాలలు వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి ట్రంకు పెట్టెల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఏరోజుకారోజు వీటిని హెచ్ఎంలు ఎమ్మార్సీ కేంద్రాల నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ ఈ నెల 2వ తేదీ నుంచి, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతులకు ఈ నెల 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటో నుంచి ఎనిమిదో తరగతి వరకూ ద్విభాషా విధానంలో (బైలింగ్యూవల్) ప్రశ్నపత్రాలను విద్యార్థులకు అందజేస్తారు. 9, 10 తరగతి విద్యార్థులకు మీడియం వారీగా ప్రశ్నపత్రాలు ఇస్తారు. ప్రతీ ప్రశ్నపత్రంపై జిల్లాకు సంబంధించి సీక్రెట్ క్యూఆర్ కోడ్ ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా వ్యవస్థలతోపాటు అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు సమ్మేటివ్ -1 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంది. ప్రశ్నపత్రాలు లీకవ్వకుండా విద్యా శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టింది. పరీక్ష పేపర్లను ఎవరైనా లీక్ చేస్తే కోడ్ సంఖ్య ఆధారంగా ఏ పాఠశాల నుంచి లీకైందో క్షణాల్లో గుర్తించవచ్చునని విద్యాశాఖాధికారులు తెలిపారు.

పరీక్షల సమయం ఇలా ?

ప్రాథమిక తరగతులకు సంబంధించి ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. 6, 8, 10 తరగతులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకూ 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

కొయ్యూరు: పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పారిపోతున్న ఆరుగురు గంజాయి స్మగ్లర్లను వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 32 కిలోల గంజాయి, ఆరు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ స్వామినాయుడు ఆదివారం తెలిపారు. చీడిపాలెం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతపల్లి నుంచి బూదరాళ్ల రహదారి మీదుగా కాకరపాడు నుంచి ఏలేశ్వరం వెళ్లేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వస్తున్నారని తెలిపారు. పోలీసులను చూడగానే వారు వాహనాలు వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. కొయ్యూరు, మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్ కుమార్‌లు వెంటనే అప్రమత్తమై వెంబడించి వారిని పట్టుకున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కుందూరుకు, అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి, చింతపల్లికి చెందిన నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు.



అరెస్టయిన గంజాయి స్మగ్లర్లు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పరవాడ: అనకాపల్లి-గాజువాక రహదారిలో లంకెలపాలెం కూడలి సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని అనకాపల్లి గవరపాలెంకు చెందిన పాలమరశెట్టి హిమకర్(19) అనే విద్యార్థి దుర్మరణం చెందాడు. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు... గవరపాలెంకు చెందిన హిమకర్, మరో ముగ్గురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై విశాఖ ఆర్కే బీచ్‌కు వెళుతున్నారు. వారు లంకెలపాలెం జీపీఆర్ లేఅవుట్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం హిమకర్ ప్రయాణిస్తున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న హిమకర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు

వణికిస్తున్న చలిగాలులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలులు వణికిస్తున్నాయి. ఆదివారం అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో ఉదయం 10గంటల వరకు పొగమంచు కురుస్తూనే ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లిలో 13 డిగ్రీలు, అరకులోయలో 14.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలి



ట్రాఫిక్ రూల్స్‌పై రేలారే సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న డీఎస్పీ సునీల్

అనకాపల్లిటౌన్: నేరాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని డీఎస్పీ బి.సునీల్ కోరారు. ట్రాఫిక్ రూల్స్‌పై రూపొందించిన రేలారే సాంగ్‌ను స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రిలీజ్ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారు లు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, ఫ్రెండ్లీ పోలీస్ కల్చర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే దగ్గరలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్ఐ జె.రమేష్ పాల్గొన్నారు.

ఉత్తరద్వార దర్శనానికి వేళాయె

- నేడు ఉదయం 10గంటల వరకు మాత్రమే అప్పన్న ఉత్తరద్వార దర్శనం
- ముస్తాబైన సింహగిరి

సింహాచలం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వేంజేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శనానికి వేళాయింది. ఆలయ ఉత్తర రాజగోపురంలో సోమవారం ఉదయం 5గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు స్వామి వైకుంఠనారాయణుడిగా శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమివ్వనున్నాడు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం, పోలీస్, ఆర్టీసీ, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్ మెడికల్ అండ్ హెల్త్, 108 తదితర శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం క్యూలు, రూ.100, రూ.300 దర్శన క్యూలు, రూ.500 ప్రత్యేక దర్శన క్యూలు సిద్ధం చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందజేయడంతో పాటు లక్ష లడ్డూలను ప్రసాదాన్ని విక్రయానికి అందుబాటులో ఉంచారు. క్యూల్లో చిన్నారులకు పాలు, భక్తులకు మంచినీరు అందించనున్నారు. ఆలయ రాజగోపురం, ఉత్తర రాజగోపురం, ఆలయ ప్రాంగణాలనకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున పుష్పాలంకరణ చేశారు. ఉదయం 4 గంటల నుంచే సింహగిరికి ఆర్టీసీ, దేవస్థానం బస్సుల రాకపోకలు ప్రారంభమవుతాయి. రాత్రి 7 గంటల వరకు మాత్రమే స్వామి వారి మూలవిరాట్ దర్శనం భక్తులకు లభిస్తుంది. దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించి రావాలని దేవస్థానం అధికారులు సూచించారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలన

ముక్కోటి ఏకాదశి ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం ఉత్సవ అధికారి, దేవదాయశాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కోవిడ్ దృష్ట్యా క్యూల ప్రవేశంలోనే శానిటైజర్లను అందుబాటులోకి ఉంచినట్లు చెప్పారు. గాల్లో సోడియం క్లోరైడ్ పిచికారీ చేస్తామన్నారు. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుందని, మిగతా భక్తులందరికీ నీలాద్రిగుమ్మం నుంచి లఘు దర్శనం అందిస్తామన్నారు. బందోబస్తు విషయంపై గోపాలపట్నం సీఐ సతీష్‌కుమార్‌తో చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా.. నూతన సంవత్సరం సందర్భంగా సింహగిరికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారం దరినీ ముక్కోటి ఏకాదశికి ఏర్పాటు చేసిన క్యూల్లో దర్శనానికి పంపించి ట్రయల్‌రన్ నిర్వహించారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి

కొయ్యూరు: శరభన్నపాలెం-నడింపాలెం గ్రామాల మధ్య వెలసిన ఎర్రగొండమ్మ తల్లి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్పష్టం చేశారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొడ్డేటి మహేశ్ వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ చైర్మన్ ఎంపీకి ఆలయం అభివృద్ధి కోసం వినతి ఇచ్చారు.దీనిపై స్పందించిన ఆమె ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవారి దీవెనలు ఉండాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరుమీదుగా ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కె.సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఇబ్రహీం పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి రూ.20 వేల నగదు

గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి ఎంపీటీసీ కొర్రా భీమ్‌రావు భార్య మంగమ్మ అనారోగ్యంతో విశాఖలో శస్త్ర చికిత్స చేయించారు. ఈ సందర్భంగా ఆమెను దామనాపల్లిలో ఎంపీ మాధవి పరామర్శించారు. అనంతరం రూ.20వేల నగదును అందజేశారు.



ఆలయంలో పూజ చేస్తున్న ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ పండు తదితరులున్నారు.

మీ బాధలు చూసి చలించిపోయా



ఎటపాక మండలం చెరువుగుంపులో ఆదివాసీ చిన్నారులతో కలసి న్యూ ఇయర్ వేడుకల్లో ఎస్పీ సతీష్‌కుమార్

- ఎస్పీ సతీష్‌కుమార్
- వడ్డిగూడెం గ్రామ సందర్శన
- స్థానికులతో మమేకం

వీఆర్‌పురం: గడచిన జులై నెలలో వచ్చిన గోదావరి వరదల్లో మీరు పడిన అవస్థలను నేరుగా చూసి చలించిపోయానని ఎస్పీ సతీష్‌కుమార్ వడ్డిగూడెం గ్రామస్తులతో అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వరదల సమయంలో ఒక పక్క ఇళ్లలోకి నీరు చేరుతుండగా మరో పక్క రహదారి బంద్ అవడంతో ఇళ్లలోని సామగ్రిని తరలించుకునే పరిస్థితి లేక పడిన ఇబ్బందులను నేరుగా చూసి చలించిపోయానని అన్నారు. నూతన సంవత్సరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆపదలు ఎదురు కాకుండా సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నారులతో ముచ్చటించి కేక్ కట్ చేశారు. ఆయన వెంట ఏఎస్పీ మహేష్‌రెడ్డి, ఎస్ఐ టి.దుర్గాప్రసాద్, ఏఎస్ఐ ఏ.రాధాకృష్ణ, హెచ్‌సీ నిర్మల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా వరహా లక్ష్మీనృసింహ స్వామి చందన పూజ



వరహా లక్ష్మీ నృసింహస్వామి చందన పూజ

మునగపాక: స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి వరహా లక్ష్మీనృసింహస్వామి చందన పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. సింహాద్రప్ప మాలలు ధరించిన భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వరహా లక్ష్మీనృసింహ స్వామి నామస్మరణతో మునగపాక మార్మోగింది. ఈ సందర్భంగా వారు ఆలపించిన పలు గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా 108 కలశాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ధమాకా విజయం సాధించడం ఆనందంగా ఉంది

దర్శకుడు నక్కి త్రినాథరావు

అనకాపల్లిటౌన్: ధమాకా విజయం సాధించడం ఆనందంగా ఉందని ఆ సినిమా దర్శకుడు నక్కి త్రినాథరావు తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక రాజా థియేటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు అనకాపల్లి థియేటర్‌లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సినిమా విజయవంతమైన సందర్భంగా ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో అగ్రహీరోలతో మరిన్ని సినిమాలు తీసేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. నక్కి త్రినాథరావును టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర సత్కరించారు.



నక్కిత్రినాథరావును సత్కరిస్తున్న మళ్ల సురేంద్ర

వాహనం జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రమణ

రాజవొమ్మంగి: మండల కేంద్రానికి చెందిన మండా రమణ అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. తాపీ పనికి వెళ్లిన రమణ బైక్‌పై కింద్ర నుంచి రాజవొమ్మంగి వస్తు లబ్బర్తి వద్ద నాచుపట్టిన కల్వర్టు దాటుతుండగా వాహనం స్కిడ్ అయింది. దీంతో అతని తల, వెన్నుముఖకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడికి స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీదుర్గ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.